# మాధవి-మాలతి

ఖజానా

"**డబుల్** డీ కంపోజిషన్...అంటే రెండు సంయోగ పదార్థాలు వాని గుణాలను పరస్పరం మార్పిడి చేసుకుని విభిన్న పదార్థాల నేర్పర్చే ...అంటే ఫర్ ఎగ్జాంపుల్..." అలా సాగిపోతోంది ఆ పాఠం. కసిమని కాలు తొక్కింది మాలతి. వెంట నే ముందుకు వంగింది మాధవి.

"మధూ...ఒక ఐడియా...నన్ను నీవు నిన్ను నేను 'ఢీ' కొన్నా మనుకో! నా పిలక జడ నీకు...నీ బారు జడ నాకు వచ్చే సి..."నవ్వాపుకోలేకపో యింది మాధవి.

"స్టేండ్ అప్..." లెక్చరర్ సింహగర్జన. "గెట్ అవుట్ బోత్ ఆఫ్ యూ."

** ** **

"అబ్బ! అన్నమాట నిలబెట్టుకున్నావ్. వచ్చేశావు." బస్సు దిగగానే ఆమె చేతిలో బాగ్ అందుకుని గుండెల్లో అంత సేపూ గుబగుబలాడిన బరువంతా ఆ మాటల్లో దింపేసింది మాలతి.

"అందరూ నీలాగే అఘోరిస్తారనుకోకు...పదేళ్ళ నుండి వస్తున్నావు..." చిన్నగా నవ్వింది మాధవి.

"ఉష్! కాల ప్రమాణాన్ని అలా పెంచేయకు. ఎవరన్నా వింటే మనం అమ్మమ్మలం అనుకోగలరు." రహస్యంగా గొణిగింది మాలతి.

"నీ చిలిపిదనం పోలేదు." వినుక్కుంటున్నట్లు కింది పెదవి కాస్త నొక్కి అన్నది.

"మరొకటి కూడా పోలేదు..."

"ఏమిటో...!"

"తరువాత చెప్తాగాని...మరి ఆయ నింకా దిగరేం?" బస్సులోకి చూస్తూ అన్నది.

"ఎవ్వరు?" మాధవి వెనక్కు తిరిగింది.

"ఏమీ ఎరుగవు. బావగారు." నొక్కి అన్నది.

"రాలేదు. ఎలా దిగమంటావ్?" చిన్నగా పెదవులు తడిచేసుకున్నది.

"ఛత్...అడ్డగాడిదలా నువ్వే తయారయ్యావా...అయితే ఎక్కే సెయ్...మా ఇంటికిమాత్రం రావద్దు..." మాలతి కళ్ళు ఎర్రబడగా.

"తల్లి తల్లి...పదిమందిలో న న్నల్లరి చెయ్యకు...పరువు నిలువు..." చెయ్యి పట్టుకుని ముందుకు అడుగు వేసింది.

మాలతి రవ్వంత బెట్టుచేసి ఏదో రాజీకొస్తున్నట్లు చిన్న పోజు పెట్టి "పద..." అని దారి తీసింది.

"వెధవ పోజు కొట్టకు. నీ కంత బావగార్రే ముఖ్యమయితే అయన్నే పంపిస్తాను. నేను వెనకే వెళ్ళిపోతాను..." కోపంగా వెనక్కి తిరగబోయింది.

"మన ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా తగువులాడుకుందాం పద..." మాధవి అడుగులు వేసింది.

"మీ పల్లెటూరు చాలా బావుందే..." కిటికీలు పట్టుకొని, గుమ్మాలు పట్టుకుని వేలాడుతూ నోరు తెరుచుకుని చూస్తున్న వాళ్ళని చూస్తూ అన్నది.

"ఏం మంచిరకం 'జూ'లా ఉన్నది?"

"...అనకూడదుగాని..."

"అలాంటి మొహమాటాలేం అక్కర్లేదు. వీళ్ళకేం మర్యాద లక్కర్లేదు. నువ్వు వెధవ్వి అని మొహం మీదన్నా బాధపడరు. అంత ఉత్తములు."

"అలాగా!" పెద్దపెద్ద కళ్ళు చేసింది మాధవి.

"మరీ అలా ఆశ్చర్యపోకు...వాళ్ళలో కలిసిపోతావ్."

"ఉహుఁ..." తల ఎగరవేసింది.

"చూడమ్మా...ఆ ఫ్లాస్కు, ఆ ట్రాన్సిస్టర్...ఆ భుజాల్నించి తీసేసి చేత్తో గట్టిగా పట్టుకో..." హెచ్చరించింది మాధవిని.

"ఏం?" క్వశ్చన్‌మార్కువేసి మళ్ళీ మాట్లాడకుండా చెప్పినట్లు చేసింది.

వెనకనుండి చిన్న రాయి వచ్చి మాధవి భుజాలకు సూటిగా తగిలింది.

"అమ్మా!" అని వెనక్కు తిరిగిచూసింది.

"ఏమనుకోకు...మా వసి వెధవాయిలకు కాస్త ఆకతాయితనం ఎక్కువ. దానికితోడు ఆ గాడిద కృష్ణాష్టమి రోజున పుట్టా డనుకుంటాను." ఏమాత్రం తొణక్కుండా చెప్తున్న మాలతిని అలాగే చూస్తుండిపోయింది.

"సిరిపల్లె చిన్నది...చిందులు వేస్తున్నది." ఒకడు ఈలవేస్తున్నాడు. మరొకడు చప్పట్లు...ఇంకొకడు "ఎహెయ్" గేదెల్ని అదలిస్తున్నాడు.

"ఏమనుకోకు...సినిమాగాలి ఈ మధ్యనే ఇక్కడ సోకింది. అందుకని పావం కాస్త మోజు."

"ఎవరే మాలతీ!" ఎవ్వరో ముసలావిడ ఎదురై ప్రశ్నించింది.

"నా స్నేహితురాల్లే బామ్మా!" మాలతి గట్టిగా అరిచింది.

" అంటే...?"

"అంటేనా...నేను,తను కలిసి చదువుకున్నాం"

"అలాగా... పెళ్ళయిందా?"

"అయ్యింది."

"మరి నల్లపూస లేవీ? కాళ్ళకు మట్టెలేవీ?" నిఘావేసింది.

నిలువెల్లా కంగారుగా చూసింది మాధవి. ఒక్క ఒంటిపేట పుస్తెల గొలుసు మాత్రమే ఉన్నది.

"అవా పెరిగిపోయాయి. కంసాలి కిచ్చింది."

"అవి లేకుండా గడప దాటడమా?" ఆవిడ మహాశ్చర్యం.

"గడప దాటడం కాదు. మన ఊరు బ్రహ్మయ్య లేడూ...వాడికే ఇచ్చింది."

"వాడు పట్నంలో అమ్మాయిలకు కూడా చేస్తున్నాడూ?"

"ఆఁ...పదవే పద" మాధవిని తొందరచేసింది.

"ఆవిడకు చెవుడా?" మాధవి గొణిగింది.

"అలాంటిదే...మామూ లు మాటలైతే అలా గట్టిగా చెప్పాలి. కాని పెదవి కదవకుండా తిట్టు...ఆవిడకు ఎంత చక్కగా వినబడుతుందో..."

"అలాగా!" నవ్వింది.

"ఆఁ...ఇదే మారాజేంద్ర భవనం. ఆట్టే బయట నిలబడకు. లోపలకు చటుక్కున వెళ్ళు. తొందర పడ్డావా బొప్పికడుతుంది. మళ్ళీ మీ ఆయన పాపిట బొట్టెక్కడదని ఆశ్చర్యపోగలరు?" ఒక చిన్న పెంకుటింటి ముందు ఆగింది మాలతి.

"ఫర్వాలేదు..."మాధవి లోపలకు అడుగు పెట్టింది. "ఎవరూ లేరా? ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది."

"ఎందుకు లేరూ...నువ్వున్నావ్...నే నున్నాను..."

"ఊఁ...నీ వెప్పుడూ ఇంతే! అడిగిన దానికి జవాబు ఏడ్వవుదా..."

"నా ఏడుపుంటే చూద్దాం. ముందు స్నానంచేసి భోజనానికి లే" మాధవి పెట్టె తెరచి బట్టలు తీసుకుంది. మాలతి లోపలకు వెళ్ళి నీళ్ళ బిందె తీసుకుంది. అనుసరించింది మాధవి.


"ఏమనుకోకు...త్వరగా స్నానం ముగించు" ఒక చిన్న గొడ పాతి అడ్డుకట్టిన తడక వెనుక పెడుతూ అన్నది.

చిన్న చిల్లులు, నిలబడితే చుట్టూ కనబడుతోంది. అలాంటిచోట బట్టలు విప్పి స్నానం ఎలా చెయ్యాలో పాలుపోలేదు మాధవికి.

"పోనీ ఏదో గదిలో పెడదామంటే మాగదులన్నీ పాలరాతితో కట్టేశారు ఏమనుకోకు. నీ అందాలెవరూ ఎత్తుకెళ్ళకుండా సూర్యుడు కాపుంటాడులే." పెద్ద పెద్ద కళ్ళలో నన్నటి కన్నీటి చుక్కలు చిల్కుకుని నవ్వు విరిసింది.

మాధవి తల వంచి రెండు క్షణా లాలోచించింది. మెల్లగా స్నానం ముగించింది.

"ఏమనుకోకు...రాకరాక వచ్చిన స్నేహితురాలివని, ప్రాణానివని ఆరాటంలో అకు కూరలు



చేశాను. మూడు వరుసగా మాడిపోగా, రెండు దొంగలు ఎత్తుకు పోగా ఒక్కటి మిగిలింది." బీరకాయ కూర వేస్తూ అన్నది మాలతి.

అన్నం కలుపుకుంటున్న మాధవి తల ఎత్తి చూసింది.

"గాభరాపడకు...దేశవాళీ చట్నీలు చాలా ఉన్నాయి. కాని ఆవకాయ అత్తవారి ఊరు. నిమ్మకాయ నీ ఇంటికి చక్కావ స్తే కారం కలవని ఉప్పుబద్దలున్నాయి. అఫ్‌కోర్సు...నీకు అవి ఎక్కువ. అసలు వాటిని చూడలేవు. కాని ఉన్నదానిని లేదన్నట్లు ఊరుకోలేనుకదా!..."మాలతి గొంతులో బాధావీచికలు తోచాయి.

"ఛ...నీ చిలిపి కథలు మానలేవు కదా!" చనువుగా కసిరింది.

"మానే సేదాన్నే కాని అవి ఇన్నాళ్ళ సహచర్యంలో నోరు తెరిచి నన్నేమీ అడగలేదు. పైగా నా కలాగే తోడుంటాయి..."

మాలతి అలా ఎన్నో చెప్తూ నవ్విస్తుంటే మాధవి హాయిగా భోజనం చేసి లేచింది.

"ఇలా ఎక్కడా ఎప్పుడూ తినలేదు..." అన్నది.

"ఏడిశావ్ లే! అభిమానంకొద్దీ అతిగా పొగడకు." కసిరింది మాలతి.

** ** **

"చూడమ్మాయ్!ఈ పాలరాతి మేడలో ఈ మధ్య అంతస్తు నీలాంటి పడతి బొమ్మల స్పర్శకు నోచింది..." వరండా నానుకుని ఉన్న గదిలో రవ్వంత వెలుగు ప్రసాదిస్తున్న కిటికీ తెరచి మాధవికి ఆ కిటికీ పక్కగా మంచం వేసింది.

"కాస్సేపు విశ్రాంతి తీసుకున్నావంటే...ఆ తరువాత మరి కాసిన్ని కబుర్లు వేసుకోవచ్చు."

అక్కడినుండి వెళ్ళిపోయింది మాలతి.

"నీకేం పని లేదుగా?" సూటిగా అడిగింది మాధవి.

"ఏం?" వెనక్కు తిరిగి చూసింది.

"ఏం లేదు...నా కప్పుడే నిద్రవచ్చి పడిపోవడం లేదు. కాస్సేపు తియ్యని కబుర్లు..."

"ఓ ఎస్...అట్లాగే పట్నం విశేషాలు..."

"పట్నానికేంగాని ఒక ప్రశ్న అడుగుతాను చెప్పు..."

"నీ వడిగినా మానినా అమ్మాయి ఎన్నడో కలిపాను చేయి." దీర్ఘం తీస్తూ అన్నది మాలతి.

"ఛ...అల్లరీ...!"

"నీకో బాబు పుడితే తెలిసేది నే నెంత బుద్ధిమంతురాల్నో!"

"అలాగా!...పాపం!"

"అది సరేగాని...మరింకా బుల్లెమ్మగారు ఉయ్యాల వెయ్యలేదేం?"

మాధవి తల వంచుకున్నది.

"ఆఁ...ఆఁ...అంత సిగ్గుపడక్కర్లేదు. ఇక్కడ బావగారేం లేరు."

• "ఆయ్...!"

"మధూ...నిన్ను బావగారు బాగా చూసుకుంటారా? అఫ్‌కోర్స్ లెటర్స్ రాసేదాని వనుకో కానీ...నీ నోటితో చెప్తే..."

"చూసుకోవడంలో ఎంతబాగా చూసుకుంటారో తెలుసా? ఆ కళ్ళు ఎప్పుడూ నన్నే చూస్తుంటాయి. ఆ చేతులు ఒక్క క్షణం నన్ను విడిచి ఉండలేవు.. నిజంగా ప్రతిదానికి మధూ...మధూ... అని కూడా కూడా తిరుగుతుంటే అంతకన్నా స్వర్గం ఉండదేమో! అనిపిస్తుంది.

పొరపాటుగా కూడా ఎప్పుడూ కోప్పడి ఎరగరు. ఎంత అలసటైనా నా కన్నులలోకి చూస్తుంటే పోతుం దంటారు.

మాలా!...ఆయనకి ఒక్క దురలవాటు కూడా లేదనుకో! కాఫీగానీ, సిగరెట్‌గాని ముట్టుకోరు. పైగా అడక్కుండానే పండుగకో నగ, వారానికో చీర...వద్దంటే వినరు. నా దేవతని అలంకరించుకోనీ అంటారు. ఎన్ని ముద్దులు, ఎన్ని మురిపాలు...అబ్బబ్బ! ఇంక సినిమాల సంగతి చెప్పనక్కర్లేదు.

"మాలా! నా కేమనిపిస్తుందో చెప్పనా? ప్రతి ఆడపిల్లా పెళ్ళిచేసుకుని ఇలాంటి భర్తని పొంది అన్ని సుఖాలు అనుభవించాలి. అప్పుడే జీవితం ధన్యం."

"అదృష్టవంతురాలివి..." వెలిగిపోయే చూపులతో నిండు మనస్సుతో అభినందించింది మాలతి.

"మరిప్పుడు చెప్పు...నీ కేమనిపిస్తుందో?" మాలతి ఒడిలో వాలిపోతూ ప్రశ్నించింది మాధవి.

"దేనిగురించి?" నిర్లిప్తంగా అడిగింది.

"నీ జీవితం గురించి..."

"అంటే...?"

"అదే ఇదంతా వింటుంటే నీకూ పెళ్ళి చేసుకోవా లనిపించడం లేదూ?"

కొద్ది క్షణాలు ఆ ప్రశ్నకు మాట్లాడలేక పోయింది మాలతి.

"అసలు...నీవూ ఒక ఇంటిదానివి కావల సింది..." గొణిగింది.

"లేదు...నా కలా అనిపించటం లేదు."

"ఎందుకని?"

"నాకు జీవితంలో తృప్తీ, సంతోషం ఉన్నాయి. నిన్ను ఆరాధించేది ఒక్క నీ భర్తే! కానీ నాకీ ఇంట్లో, ఈ ఊళ్ళో అందరి మనస్సుల్లోను స్థానం ఉంది. నేను నా జీవితానికి కుదిరిపోయాను. మరి మారలేను..." ముఖం పక్కకు తిప్పుకున్నది.

"ఏమో! ఏం తృప్తో! నీ దంటూ ఒక సంసారం లేకపోయాకా..."

"అలా అనకు మధూ! మందు కలిపి ఇస్తుంటే నాన్న చూసే చూపులు...వాళ్ళకోసం కష్టపడి సంపాదిస్తున్నానని చెల్లాయిలూ, తమ్ముళ్ళూ చూపించే కృతజ్ఞత. నే నొక త్యాగమూర్తినన్న గౌరవ భావంతో ఊరి వారు చూపించే ఆపేక్ష ఓహ్! నీకెలా చెప్పను?" మాధవి కళ్ళు మూసుకున్నాయి.

"నిజంగా నా జీవితం చూస్తే నువ్వే పెళ్ళి ఎందుకు చేసుకున్నానా అనుకుంటావ్. అంత ఆనందంగా ఉంది. నీకు తెలుసో తెలియదో సుఖాన్ని పొందినప్పటి అందంకన్నా దాన్ని త్యాగం చేసినప్పటి అనుభవం గొప్పది."

మాధవి మెల్లగా నిద్రపోయింది.

తిరిగి మాధవి లేచేసరికి పెద్దపెట్టున గొడవ వినబడుతుననది.

"అవును నీ సంగతి ఎవరికి తెలియదు? చుట్టం వంకని పొద్దుటే నువ్వూ అన్నం మెక్కేశావు. మాకుమాత్రం గంజి కాసి ఉంచావు" మాలతి తమ్ముడి కంఠం పెద్దపెట్టున వినబడుతూంది.

"లేదమ్మా...నాన్నమీద ఒట్టు..." ప్రాధేయపడుతున్నది మాలతి.

"అవును. నాన్న కూడా చచ్చిపోతే చాలు నీకు...నీకు ఏ గొడవా ఉండదు..."మాలతి తండ్రి కసురుకున్నాడు.

"ఎందుకునాన్నా అంత లేసి మాటలు?" బాధగా అన్నది మాలతి.

"మందుల్లేకుండా నే నిలా చచ్చిపోయినా పరవాలేదు గాని నీవుమాత్రం ఆ పని చెయ్యవు..." తండ్రి నిష్ఠూరం.

"ఛ...కాలేజీకి చెల్లెలు మాసిన బట్టలు, చిరిగిన బట్టలు కట్టుకుని వెడుతుంటే లేదుగాని సిగ్గు ఆ పెద్ద కావుని కట్టుకోమంటే..." చెల్లెలు నిరసన.

"చెల్లీ! పోనీ నువ్వు చేసుకోగలవా ఆ ముసలాడిని?" మాలతి.

"అవును మరి! నువ్వు అప్సరసవని నీకు అతను తగడు..." చెల్లెలు సాగదీసింది.

"ఊరుకోవే. దానికి సుఖపడటం చేతకాదు. మననూ సుఖపడనివ్వదు." మాలతి పెద్ద తమ్ముడు

మాధవి కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగింది. "నాకు జీవితంలో తృప్తి ఉంది..." మాలతి మాటలు చెవిలో మారుమోగాయి. మెల్లగా లేచి వెళ్ళి గడప దగ్గర నిలబడింది. అందరూ ముఖాలు బిగించుకుని కూర్చున్నారు.

మాలతి ఉలిక్కి పడి చూసింది మాధవిని. "మధూ! అఫ్‌కోర్స్...వీళ్ళందరికీ గౌరవం...అంతే..." కన్నీళ్ళు విదిలించేసి పెరట్లోకి వెళ్ళిపోయింది.

"మహా త్యాగమూర్తి..." చెల్లెలు విసురుగా లేచిపోయింది.

"వెధవ పోజు..." తమ్ముడు చకచకా వెళ్ళిపోయాడు.

కంచం దగ్గరకు లాక్కుని ఆ గంజి చూస్తూ బావురుమన్నాడు చిన్న తమ్ముడు.

"ఊరుకోండిరా...మనందరం బతికి ఉన్నామని ఏడుస్తున్నది." తండ్రి సముదాయింపు.

ఇవన్నీ మాధవి విన్నది.

"మధూ ముఖం కడుక్కో..."పెరట్లో నుండి పిలిచింది మాలతి.

మాధవి కదిలింది.

"ఏమనుకోకు...మా ఊళ్ళో సోప్ ఇండస్ట్రీస్ అని పెద్ద కంపెనీ ఉన్నది కాని, తెలుసూ...కుమ్మరి వాడికి కుండ కరువని...అందుకని..." మాలతి నవ్వింది.

'పిచ్చిమాలతీ...' అనుకున్నది మాధవి.

మాట్లాడకుండా ముఖం కడుక్కుని తుడుచుకున్నది.

"మధూ! అలా తోటల్లోకి వెడదామా.." మాలతి అడిగింది.

"సారీ ...వద్దు..."

"నువ్వెందుకు వద్దంటున్నావో తెలును. కాని ఇంటి దగ్గరే ఉంటే నీకు ఉన్న మతి పోతుంది."

"పర్వాలేదు. కాని, మీ ఊరి జనాభా..."

"వాళ్ళ నేమీ అనకు...వాళ్ళు ఉత్తములు..." మాధవి మాటలకు అడ్డు వచ్చింది. "ఎస్. ఎస్ యూ 'ఆర్ కరెక్ట్."

×× ×× ××

అన్నం వడ్డిస్తున్న మాలతిని వారించింది మాధవి...

"గంజి అంటారే అదెలా ఉంటుందో అది పెట్టవే..."

అంతే! వడ్డిస్తున్న మాలతి రెండు చేతుల్లోను ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

రెండు క్షణాలు ఎలా ఓదార్చాలో తెలియక బిత్తరపోయింది.

"ప్లీజ్...నిన్ను అవహాస్యం చేస్తున్నా ననుకోకు. నాకు తినాలనిపించింది. కాని, నీకు బాధగా ఉంటే అన్నమే పెట్టు."

"నే నలా అనుకోవడం లేదు. నాది చాలా గౌరవనీయమైన బ్రతుకు..." గంజి వడ్డించింది.

ఆ రాత్రి మెలకువ వచ్చి చూసేసరికి దూరంగా నూతి దగ్గర మాలతి ఒంటరిగా కూర్చుని ఉన్నది. మాధవి మెల్లగా లేచి ఆమె దగ్గర కెళ్ళింది. మాలతి భుజం మీద చెయ్యి వేసింది. మాలతి తల ఎత్తి చూసింది. కన్నీళ్ళు విదిలించింది.

ఆమె పక్కనే చతికిలబడింది మాధవి.

"మా ఊరు నచ్చిందా?"

"రేపు వెళ్ళిపోదాం అనుకుంటున్నాను..." మాధవి జవాబు.

బాధగా చూసింది మాలతి.

మాధవి మాట్లాడలేదు.

"మధూ...నీ రాక నా జీవితంలో ఒక మలుపు తీసుకు వచ్చింది..."

"..."

"పెళ్ళంటే ఒక మంచి భావాన్ని, వైవాహిక జీవితం మీద ఒక కొత్త అనురక్తిని పెంచావు..."

ఉలిక్కిపడి చూసింది మాలతిని.

"నేను...నేను... పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను..."

మాధవి కళ్ళల్లో కన్నీటి తెఱలు జారాయి.

"వరుడు మన్మధుణ్ణి మించిన వాడేమో గాని, నా గ్రహపాటు వల్ల అంతకన్నా ఆకర్షణీయంగా కనబడతాడు. ఈ ఊరి మొత్తానికి పెద్ద. ఇద్దరు పెళ్ళాలు చచ్చినా పెళ్ళాం మీద తీపి, యౌవనం

